పేపర్ లీక్‌లు, పరీక్ష మోసాలు పరిశీలిస్తే.. 2005–2026 మధ్యకాలంలో 21 రాష్ట్రాలలో 220 సంఘటనలు నమోదయ్యాయి. ఇందులో 2015కు ముందు 72 కేసులు నమోదు కాగా, 2015 తర్వాత 148 కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనలు అన్ని ప్రభుత్వాల హయాంలలోనూ జరిగాయి. కానీ బీజేపీ, దాని మిత్రపక్షాల పాలనలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. మొత్తం 220 కేసులలో ఎన్డీఏ పాలనలో 128 కేసులు (58శాతం), కాంగ్రెస్, దాని మిత్రపక్షాల పాలనలో 55 కేసులు (25 శాతం) నమోదయ్యాయి. 2015 తర్వాత బీజేపీ వాటా ఇంకా పెరిగింది. నమోదైన 148 కేసులలో 99 కేసులు (67 శాతం) ఎన్డీఏ పాలనలోనే చోటుచేసుకున్నాయి.

'పేపర్ లీక్‌లు కావడం కాంగ్రెస్ హయాంలో అతి సాధారణమైన విషయం' అని వ్యాసకర్త వ్యాఖ్యానించారు. కానీ గణాంకాలు దానికి వ్యతిరేకంగా ఉన్నాయి. 2015కు ముందు నమోదైన కేసుల్లో కేవలం 12 కేసుల్లోనే సీబీఐ శిక్ష వేయించగలిగింది. కానీ, 2015 తర్వాత 148 కేసులలో కేవలం ఒక్క కేసులోనే నేరం రుజువై శిక్ష పడింది. అది కూడా చండీగఢ్‌లోనే. సీబీఐకి 2015 తర్వాత కనీసం 17 కేసులు దర్యాప్తునకు అప్పగించారు. అందులో శిక్ష నమోదు రికార్డు సున్నా! అదే సమయంలో 11 కేసులలో ఈడీ పనితీరు శూన్యం. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో జవాబుదారీతనం కుప్పకూలిపోయింది. అంచెల కుల సమాజంలో పరీక్ష వ్యవస్థలకు ఉండే సమానత్వ సామర్థ్యం దెబ్బతిని, సాధికారతే ప్రశ్నార్థకం అయింది.

యూజీసీ నెట్–2024 పేపర్ లీక్ ఘటనలో నేను కూడా బాధితుడినే. ఈ ఏడాది కూడా ప్రశ్న పత్రంలో అక్షరదోషాల వల్ల మూడు పేపర్లను రద్దు చేశారు. ఇంతటి తీవ్ర సంక్షోభానికి సమాధానం అడగవలిసిన వ్యవస్థలు ఈ దేశ విద్యార్థులకు నిరాశను మిగల్చడమే కాక 'బొద్దింకలు' అని అవమానపరిచాయి. దిగజారిన రాజ్యాంగ, ప్రజాస్వామిక విలువలను, జవాబుదారీతనాన్ని తట్టి లేపి, తిరిగి తన న్యాయమైన స్థానంలో పునరుద్ధరించడం కోసమే ఈ ఉద్యమం. ఎంత దాడి జరిగినా విద్యార్థి ఉద్యమం మాత్రం సమాజాన్ని మానవీకరించే దిశగా, వ్యవస్థలను ప్రజాస్వామీకరించి కాపాడుకునే దిశగానే సాగుతుంది.

○ పి. ఆనంద్
పీహెచ్‌డీ విద్యార్థి, పుదుచ్చేరి

వెయ్యి రోజుల ప్రజాపాలన!

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు, ఆత్మగౌరవాన్ని పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ వెయ్యి రోజులు కేవలం క్యాలెండర్లో గడిచిన రోజులు కావు. తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన నిర్ణయాల కాలం.

యువతకు ఉద్యోగాలు, రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, పేదలకు గౌరవప్రదమైన జీవనం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు– ఇవన్నీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది గంటల్లోనే అమలు చేసిన మహాలక్ష్మి పథకం ఇందుకు నిదర్శనం.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా కోట్లాది మంది మహిళలకు ఆర్థిక ఉపశమనం లభించింది. ఇప్పటి వరకు 345 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు జరిగి, మహిళలు సుమారు రూ.12,075 కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారు. ఈ పథకం విజయవంతం కావడంతో పెరిగిన ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీని బలోపేతం చేయడంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొత్త బస్సుల కొనుగోలు, ఆధునిక బస్ స్టేషన్ల నిర్మాణం, కొత్త డిపోల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అనేక చర్యలతో ఆర్టీసీని ప్రజలకు నమ్మకమైన ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దింది. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. 2013 నుంచి పెండింగులో ఉన్న రూ.280కోట్ల బాండ్లను క్లియర్ చేయడం; 2017, 2021 పే స్కేల్ సమస్యలను పరిష్కరించడం; 11వ పీఆర్సీ అమలు; పెండింగులో ఉన్న డీఏల విడుదల; పీఎఫ్, సీసీఎస్ బకాయిల తగ్గింపు వంటి చర్యలు ఉద్యోగుల్లో నూతన విశ్వాసాన్ని నింపాయి.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముక. ప్రజా ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలను రుణభారం నుంచి విముక్తి చేసింది. రైతు భరోసా కింద రూ.36వేల కోట్లకు పైగా పెట్టుబడి సాయం అందించింది. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతు బీమా, పంట నష్ట పరిహారం వంటి కార్యక్రమాలతో రైతుకు ప్రభుత్వం అండగా నిలిచింది. ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించింది.

సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; ఒక కుటుంబానికి విద్యుత్ భారం తగ్గించడం, వంటగ్యాస్ ఖర్చును తగ్గించడం, నాణ్యమైన బియ్యం అందించడం, ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం– ఇవన్నీ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలే. ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చింది. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతోంది. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసి, మరింత మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకువచ్చింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నది.

మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంకు లింకేజీ కల్పించడం; వడ్డీ రాయితీలు ఇవ్వడం; పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి కొత్త ఆదాయ మార్గాలను ప్రభుత్వం కల్పించింది.

వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ.



సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేసింది ప్రజాప్రభుత్వం. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలు చేయడం ద్వారా సామాజిక న్యాయంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలో గణనీయమైన వాటాను కేటాయిస్తున్నది.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం, కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా విద్యారంగంలో సమగ్ర మార్పులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగింది.

యువత ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా 72 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టింది ప్రభుత్వం. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త అవకాశాలను కల్పిస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ–హబ్, టీ–వర్క్స్, వీ–హబ్ వంటి సంస్థల ద్వారా వేలాది మంది యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందుతోంది.

తెలంగాణను పెట్టుబడుల అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు చేపట్టింది. టీజీ–ఐపాస్ ద్వారా వేలాది పారిశ్రామిక యూనిట్లకు అనుమతులు ఇచ్చి భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నది.

ప్రజా ప్రభుత్వం కేవలం ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు చూపడం మాత్రమే కాదు; వచ్చే తరాల తెలంగాణను నిర్మించేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించింది. తెలంగాణ రైజింగ్–2047లో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది.

వెయ్యి రోజుల ప్రజాపాలన ఒక మైలురాయి మాత్రమే. తెలంగాణను మరింత బలమైన, సమానత్వంతో కూడిన, పెట్టుబడులకు అనుకూలమైన, ఉపాధి అవకాశాలు కలిగిన, పర్యావరణహితమైన, ప్రపంచస్థాయి రాష్ట్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఇది ఒక కీలక దశ. రైతు ముఖంలో చిరునవ్వు, మహిళ చేతిలో ఆర్థిక స్వావలంబన, యువతకు ఉద్యోగం, విద్యార్థికి నాణ్యమైన విద్య, పేదవాడికి సొంత ఇల్లు, ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత, ప్రతి ప్రాంతానికి అభివృద్ధి – ఇదే ప్రజా పాలన లక్ష్యం.

● పొన్నం ప్రభాకర్
రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ప్రవేశాల గడువు తేదీని సెప్టెంబరు 15 వరకు పొడిగించినట్లు జిల్లా ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ కె లింగయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత తప్పనిసరిగా అవసరమైన డాక్యుమెంట్స్ సంబంధిత సెంటర్‌లో అందజేయాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచవద్దు

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే

సుభాష్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 172 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్‌వో స్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఇందిరమ్మ చివరి బిల్లును మంజూరు చేయండి

- కుమ్మరి ఆనంద్, కరీంనగర్

ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకంలో ఇల్లు మంజూరు అయ్యిందని, నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయి. ఇప్పటి వరకు రెండు విడతల బిల్లులు విడుదల చేసిన అధికారులు మూడో బిల్లు 1.5 లక్షలు ఇంతవరకు విడుదల చేయలేదు. దీంతో ఇంటి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. చాలా ఇబ్బందులు పడుతున్నాం. కలెక్టర్ బిల్లు విడుదల చేయించాలని కోరుతున్నాం..

సదరం సర్టిఫికెట్ ఇప్పించండి..

- పారునంది మనస్విని, లస్మన్నపల్లి, సైదాపూర్

తండ్రి గుండెపోటుతో చనిపోయాడు..మరుగుజ్జు అని తల్లి వదిలేసింది. నానమ్మ, తాతా చేరదీశారు. సదరంకు వెళితే రెండు శాతం వికలాంగత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. నానమ్మ, తాత వద్ద ఉంటున్నాను. సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తే పింఛన్ అందుతుంది. అధికారులు నాకు న్యాయం చేయాలి.

కరువులోనూ కరుణించిన గంగమ్మ

- జిల్లాలో పెరిగిన భూగర్భ జలమట్టం
- ఆగస్టు నెలలో 3.17 మీటర్ల పెరుగుదల

రామడుగు మండలంలో మత్తడి దూకుతున్న చెరువు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, కరీంనగర్)

జిల్లాలో భూగర్భ జలమట్టం పెరుగుతోంది. ఇటీవల కురిసిన మోస్తారు వర్షాల కారణంగా పాతాళ గంగ ఇంకాస్త పైకి వచ్చింది. ఈ వర్షాకాలంలో నీటి గోస రూపంలో ఎదురయ్యే కష్టాలకు కాస్త తెరపినిచ్చింది. ఎల్‌నినో ప్రభావంతో ఈసారి పంటల సాగుకు, తాగునీటికి కష్టకాలమేననే సంకేతాల నేపథ్యంలో కురిసిన కాసిన్ని వానలే భూగర్భజల మట్టం పెరగడానికి దోహదపడ్డాయి. ముఖ్యంగా కరీంనగర్ కార్పొరేషన్‌లో రెండు నెలల క్రితం పలు ఇళ్లలోని బోర్లు అడుగంటే దుస్థితి నెలకొంది. చాలామంది ట్యాంకర్ల ద్వారా సంపులను నింపాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇలాంటి కష్టాలకు కాస్త ఊరట కలిగించే విధంగా లోతుకు దిగజారిన నీళ్లు కాస్త పైపైకి పెరిగాయి. ఇప్పటికీ జిల్లాలో లోటు వర్షపాతమే ఉంది. ఆగస్టు చివరినాటికి 565.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికిగానూ 474.9 మిల్లీమీటర్ల మాత్రమే కురిసింది. 16 శాతం తక్కువ వర్షం కురిసింది. ఈ పరిస్థితుల్లో రైతాంగానికి ఊరట కలిగించే విధంగా భూమిలో నీరు పెరిగింది.

● గత నెలతో పోలిస్తే మెరుగ్గా..

జూలై నెలలో జిల్లాలో సగటున 9.21 మీటర్ల లోతులో నీళ్లుండగా.. ఇప్పుడు ఆగస్టు చివరి నాటికి 6.04 మీటర్లకు వచ్చాయి. నెల రోజుల్లోనే దాదాపు 3.17 మీటర్లు పెరిగాయి. ఈ ఏడాది మే నెలతో పోలిస్తే ఇప్పుడు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో అగాధానికి పడిపోయిన నీటి మట్టం అమాంతంగా పెరిగింది. మే నెలలో జిల్లాలో సగటు 8.44 మీటర్ల లోతులోనే నీటి జాడలు కనిపించగా ఇప్పుడా పరిస్థితి ఇంకాస్త మెరుగనే విధంగా 6.04 మీటర్లకు ఎగబాకింది. మానకొండూర్ మండలంలో కేవలం 1.47 మీటర్లలో నీరు లభ్యమవుతుందని జిల్లా భూగర్భజలవనరుల శాఖ అధికారులు ఇటీవల చేపట్టిన కొలతల్లో స్పష్టం చేశారు. చొప్పదండి మండలంలో గరిష్ఠంగా 13.14 మీటర్ల భూగర్భ జలాలు పడిపోయాయి. ఒకప్పుడు గంగాధర మండలంలో ఈ గడ్డుపరిస్థితి ఉండగా ఇప్పుడు అక్కడ 12.06మీటర్ల లోతులో నీరు ఉంది.

● గత ఏడాదికన్నా తక్కువ

గతేడాది సరిగ్గా ఇదే సమయంతో పోలిస్తే మాత్రం జిల్లాలో జలవనరుల (మిగతా 6వ పేజీలో)

జిల్లావ్యాప్తంగా భూగర్భ జలాల వివరాలు (మీటర్లలో)

మండలం	జూలై	ఆగస్టు	పెరుగుదల
చిగురుమామిడి	11.75	7.11	4.64
చొప్పదండి	14.54	13.14	1.40
ఇల్లందకుంట	5.32	4.47	0.85
గంగాధర	16.45	12.06	4.39
గన్నేరువరం	8.97	2.81	6.16
హుజూరాబాద్	8.69	8.61	0.08
జమ్మికుంట	4.90	3.86	1.04
కరీంనగర్	15.55	10.34	5.21
కరీంనగర్‌రూరల్	4.95	2.16	2.79
కొత్తపల్లి	8.34	5.39	2.95
శంకరపట్నం	7.96	5.02	2.94
మానకొండూర్	7.75	1.47	6.28
రామడుగు	8.31	6.88	1.43
సైదాపూర్	8.24	5.34	2.90
తిమ్మాపూర్	9.83	4.26	5.57
వీణవంక	5.35	4.68	0.67

కరీంనగర్ త్రీ టౌన్ ఆకస్మిక తనిఖీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌ను సీపీ గౌస్ ఆలం సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్, స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారికి కేటాయించిన విధులు, నిర్వహిస్తున్న బాధ్యతలపై ఆరా తీశారు. రికార్డులను క్రమ బద్ధంగా నిర్వహించాలని, నమోదైన కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో పొందుపరచాలని ఆదేశించారు. అన్ని అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి స్థాయిలో పట్టు సాధించి, రోజువారీ విధుల్లో వాటిని వినియోగించాలని సూచించారు. అనంతరం ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాలను సెక్టార్లు, సబ్- సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ/ప్రాంత పోలీస్ అధికారులను కేటాయించి, ప్రజలకు పోలీసుల అందుబాటు మరింత పెంచాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న సీపీ గౌస్ ఆలం

గిద్దె పెరుమాళ్ల ఆలయంలో విశేషాలంకరణలో గణపతి

మహాశక్తి ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

కరీంనగర్ కల్చరల్ ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆలయాల్లో సోమవారం సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ సోమవారం కావడంతో భక్తులు సంకట నాశన గణేశ స్తోత్రాలను, దక్షిణ, ఫల, తాంబూలాలను బ్రాహ్మణులకు, ముత్తైదువలకు సమర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్ రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో నిర్వహించిన పూజల్లో కుటుంబ సభ్యులతో కలసి కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

4న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జూనియర్ బాలికలు, జూనియర్ బాలుర కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను 4న నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రం లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం లో మధ్యాహ్నం 3 నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ అమిత్ రావు, బుర్ర మల్లేష్‌గౌడ్, కబడ్డీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంపత్‌రావు తెలిపారు. సబ్ జూనియర్ బాలికలు 55 కిలోలలోపు బరువు కలిగి 16 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్నవారు (13-12- 2010) అర్హులని తెలిపారు. జూనియర్ బాలుర విభాగంలో క్రీడాకారులు 75 కేజీల బరువు లోపు ఉండి 5-11-2006 తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు మధ్యాహ్నం మూడు గంటలకు అంబేద్కర్ స్టేడియంలో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరాలు ఉంటాయని తెలిపారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

- టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- విద్యుత్ అమరవీరుల స్మారక స్తూపం ప్రారంభం

అమరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అమరుల త్యాగాలు మరువలేనివని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆయన సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్థలో విద్యుత్ రక్షణ ప్రమాణాల ప్రాధాన్యాన్ని వివరించారు. సంస్థ కోసం, ప్రజలకు నిరంతర విద్యుత్ సేవలు అందించే క్రమంలో ప్రాణాలు అర్పించిన విద్యుత్ అమరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. వారి కుటుంబాలకు సంస్థ అండగా ఉంటుందనే భరోసా కల్పించేందుకే ఈ స్తూపాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. 'జీరో యాక్సిడెంట్' టీజీ ఎన్‌పీడీసీఎల్ లక్ష్యమన్నారు. ఏ ఒక్క విద్యుత్ ఉద్యోగి లేదా సిబ్బంది ప్రమాదాల బారిన పడకూడదన్నారు. ప్రతీ ఉద్యోగికి నాణ్యమైన భద్రతా పరికరాలు, అవసరమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సమయంలో ఒత్తిడి, హడావుడి లేదా నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎంత అనుభవం ఉన్నప్పటికీ ప్రతీ ఒక్కరూ సేఫ్టీ ప్రొటోకాల్స్, ఎర్తింగ్ విధానాలను తప్పక పాటించాలన్నారు. ఈ స్మారక స్తూపం జ్ఞాపకం మాత్రమే కాదు, ప్రతీ రోజు విధుల్లోకి వెళ్లే ముందు భద్రతా ప్రమాణాలు పాటిస్తామని ప్రతీ ఒక్కరికీ గుర్తుచేసే ఒక ప్రతిజ్ఞా స్థలం అని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్ పి మధు సూదన్, సీఈలు కె మాధవరావు, తిరుమలరావు, సురేందర్, ఎస్ఈ ఆర్ రవీందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన 6
4 రేకుర్తిలో ఎలుగుబంటి సంచారం

జైలును పరివర్తన కేంద్రంగా భావించాలి

కరీంనగర్ జైలును సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి వై యశ్వంత్ సింగ్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): జైలును పరివర్తన కేంద్రంగా ఖైదీలు భావించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వై యశ్వంత్ సింగ్‌జా అన్నారు. ఆయన సోమవారం జిల్లా జైలును సందర్శించి ఖైదీలకు అందుతున్న సేవలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖైదీలు కారాగారంలో గడిపిన కాలంలో సత్ప్రవర్తనతో మెలిగి బయటకు వెళ్లిన తర్వాత ఎటువంటి నేరాలకు పాల్పడ కుండా ఉండాలన్నారు. జైలును సందర్శిస్తున్న ఉచిత న్యాయవాదులను సంప్రదించి న్యాయ సహాయం పొందాలని సూచించారు. జిల్లా జైలులో న్యాయ సేవాధికార సంస్థ సెల్ నంబర్‌ను ఖైదీలకు కనిపించే స్థలంలో ప్రదర్శించాలని జైలు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, జైలర్లు లక్ష్మీనారాయణ, అజయ్, డిప్యూటీ జైలర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ వేణు పాల్గొన్నారు.

యువతా.. జాగ్రత్త

కోరలు చాస్తున్న గంజాయి భూతం

- సరదాగా మొదలుపెట్టి బానిసలుగా మారుతున్న విద్యార్థులు
- డబ్బుల కోసం నేరాలకు పాల్పడుతున్న వైనం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర మత్తుపదార్థాల వ్యసనం కారణంగా యువకులు తెలియకుండానే నేరాల వైపు అడుగులు వేస్తున్నారు. మత్తుకు బానిసలైన వారు ఆ అలవాటును కొనసాగించడానికి, డబ్బుల కోసం చిన్న చిన్న దొంగతనాల నుంచి దారుణమైన దోపిడీలు, హత్యాయత్నాలకు తెగబడుతున్నారు. ఇది సామాజిక సమస్యగా మారుతున్నది. యువత నేరాల వైపు వెళ్లడానికి ప్రధాన కారణాలు ఆర్థిక అవసరాలు. గంజాయి కొనడానికి డబ్బులు లేకపోవడంతో ఇంట్లో దొంగతనాలు చేయడం, బయట వ్యక్తులను బెదిరించి వసూళ్లకు పాల్పడటం వంటి నేరాలకు పాల్పడుతున్నారు. మత్తులో ఉన్నప్పుడు ఏది తప్పు అనే ఆలోచనా శక్తిని పూర్తిగా కోల్పోయి క్షణికావేశంలో నేరాలకు పాల్పడుతున్నారు.

● ఖర్చుల కోసం నేరాలు

క్యూరియాసిటీ, స్నేహితుల ఒత్తిడి, దమ్ముంటే తాగు అనే ఛాలెంజ్‌లు, సోషల్ మీడియా రీల్స్‌లో గంజాయిని కూల్‌గా చూపించడం, ఇంట్లో గొడవలు, బ్రేకప్, చదువు, ఆర్థికపరమైన ఇబ్బందుల ఒత్తిడి తట్టుకోలేక... ఒకసారి డ్రగ్ ట్రై చేద్దాం అని మొదలుపెట్టి జీవితం పాడు చేసుకుంటున్న కేసులు కరీంనగర్‌లో ఇటీవల బాగా పెరుగుతున్నాయి. కొద్ది రోజుల క్రితం డిగ్రీ చదువుతున్న విద్యార్థితోపాటు మరో యువకుడు ద్విచక్ర వాహనాలు దొంగిలించిన కేసులో పోలీసులకు పట్టుబడ్డారు. వారిని పోలీసులు విచారించగా గంజాయి మత్తుకు అలవాటు పడి ఖర్చుల కోసం బైక్‌లను దొంగిలించినట్లు వెల్లడైంది. మరో ఘటనలో ఇద్దరు యువకులు తాళంవేసి ఉన్న ఇళ్లలో చొరబడి సొమ్ములు అపహరించుకుపోయారు. వీరు కూడా గంజాయి కోసం దొంగతనాలు చేశారు. మరో సంఘటనలో ఒక విద్యార్థి తన ఇంటిలోనే విలువైన వస్తువులు ఎత్తుకుపోయి బయట అమ్ముకుని, గంజాయి కొనుగోలు చేశాడు. మరి కొందరు యువకులు గంజాయిని మొదట సరదాగా సేవించి, క్రమక్రమంగా వ్యసనపరులుగా మారి, డబ్బుల కోసం వారు గంజాయి విక్రయదారులుగా మారారు.

తల్లిదండ్రులు పిల్లల్లో గమనించాల్సిన లక్షణాలు...

పిల్లల కళ్ళు ఎర్రగా, నీళ్లు కారడం, అతిగా పర్‌ఫ్యూమ్ వాడడం (వాసన రాకుండా ఉండడానికి), ఆకలి తీరు మారడం, అకస్మాత్తుగా బాగా తినడం, ఆ తర్వాత తినకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే వారిని తల్లిదండ్రులు గమనించాలి. వ్యసనానికి బానిసలైన వారిని నేరస్థులుగా చూడకుండా, వారికి సరైన సమయంలో మానసిక వైద్యం, కౌన్సిలింగ్ అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావాలి.

● పలు అనర్థాలు

గంజాయి, ఇతర మత్తుపదార్థాలు వాడితే జ్ఞాపకశక్తి, నిర్ణయం తీసుకునే శక్తి శాశ్వతంగా దెబ్బతింటుంది. భయం, అనుమానం, డిప్రెషన్, సైకోసిస్ సమస్యలు తలెత్తుతాయి. ఒక్కసారి పోలీస్ కేసు నమోదైతే పాస్‌పోర్ట్, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కోల్పోతారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద 6 నెలల నుంచి 10 ఏళ్ల జైలు శిక్షలు ఉంటాయి.

● వివిధ రూపాల్లో 'మత్తు'..

సాధారణ ప్రజలకు తెలిసింది గంజాయి పౌడర్, గంజాయి ఆకు ఒక్కటే. పోలీసులకు, ఇతర నిఘా సంస్థలకు చిక్కకుండా గంజాయిని వివిధ రూపాల్లో తయారుచేసిన స్మగ్లర్లు మార్కెట్‌లోకి వదులుతున్నారు. గంజాయి పౌడర్‌తో తయారుచేసిన సిగరెట్లు, హష్ ఆయిల్, చాక్లెట్ రూపంలో లభ్యమవుతున్నది. గంజాయి, ఇతర నిషేధిత డ్రగ్స్‌కు అలవాటుపడినవారు కొన్ని ప్రత్యేకమైన వ్యాధులకు ఉపయోగించే టాబ్లెట్లను కూడా ఇంజక్షన్ రూపంలో తీసుకుంటూ మత్తులో జోగుతున్నారు. కరీంనగర్ రూరల్ పోలీసులు ఇటీవల తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి భారీగా గంజాయి, హష్ ఆయిల్‌తోపాటు మత్తు టాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌తో విక్రయించాల్సిన మందులను మెడికల్ షాపు నిర్వాహకులు విచ్చలవిడిగా అమ్ముతున్నారు. కరీంనగర్‌లోని ఒక మెడికల్ షాపును సీజ్ చేసి, కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MOHAMMED YOUSUFUDDIN, S/O. MOHAMMED KHAJA MOINUDDIN, H.NO.10-4-559, SUBASHNAGAR, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS " SYED YOUSUFUDDIN " S/O. KHAJA MOINUDDIN

AJK-18640

CHANGE OF NAME

★ I, MUDAPELLY SUDHAKAR (OLD NAME), H.NO:3-1 4/3, VILLAGE : INDHANPALLY, MANDAL : JANNARAM, DISTRICT : MANCHERIAL (T.G), HAVE CHANGED MY NAME AS MUTAPALLI SUDHAKAR S/O. RAJANNA (NEW NAME)

AJK-286784

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి ప్రకటనలకై సంప్ర : 99854 11174

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 97036 18691, 99854 10640
జగిత్యాల, :- సెల్ : 99854 11262
మెట్‌పల్లి :- సెల్ : 98498 20254
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063

12 క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టివేత

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్మపల్లి వద్ద ట్రాలీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మధుకర్ తన సిబ్బందితో పట్టుకున్నారు. సోమవారం కుర్మపల్లి వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో ఆటో ట్రాలీలో ఉన్న రేషన్ బియ్యంను గుర్తించి ఆటోతో పాటు బియ్యంను సీజ్ చేసి పెద్దపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ మధుకర్ తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్‌లు ఏలియా, ఆనంద్ ఉన్నారు.

విద్యుత్ మోటార్ వైర్ల చోరీ

అంతర్గాం, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిర్యాల, విస్సంపేట గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి పంట పొలాల వద్ద రెండు గ్రామాలకు చెందిన ఎనిమిది మంది రైతులకు చెందిన త్రీఫేజ్ మోటార్ల విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. పదిహేను రోజుల క్రితం విస్సంపేట గ్రామానికి పలువురు రైతుల వైర్లు చోరీకి గురయ్యాయి. పొట్యాల గ్రామానికి చెంది న ఓ రైతు కుటుంబం పత్తి చేను పనులకు వెళ్లిన సమయంలో మధ్యాహ్నం ఇంట్లో చొరబడి బంగారు నగలు, నగదు ఎత్తుకెళ్లారు. వరుస దొంగతనాలతో మండలంలోని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు

వేములవాడ రూరల్, అగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మల్లారం గ్రామ సర్పంచ్‌పై అట్రాసిటీ కేసు నమోదైనట్లు రూరల్ ఏఎస్సై రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామ తొమ్మిదో వార్డు సభ్యుడు అనీల్‌కుమార్ గ్రామపంచాయతీ కార్యాలయానికి సోమవారం వెళ్లిన క్రమంలో సర్పంచ్ అర్పిత, ఆమె భర్త వీరారెడ్డి తనను కులం పేరుతో దూషించారని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన ఫిర్యాదు చేశాడు. అనీల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఏఎస్సై రవీందర్‌రెడ్డి తెలిపారు.

- ఆపదలో మేమున్నామంటూ ప్రవాస భారతీయులకు అండ
- 15 ఏళ్లుగా ఈటీసీఏ సేవా స్ఫూర్తి

గల్ఫ్ మృతుడి కుటుంబానికి లక్ష ఆర్థిక సహాయం అందిస్తూ..

ఎడారిలో మానవతావాదులు

బోయినపల్లి ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం ఎడారి దేశానికి వెళ్లిన ప్రవాస భారతీయులకు ఆపదలో మేమున్నామంటూ ఈటీసీఏ(ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్) అండగా నిలుస్తోంది. 2011 ఫిబ్రవరి 11న పిచర కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంస్థ 15 ఏళ్లుగా సేవా కార్యక్రమాలతోపాటు తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తోంది.

విధి వంచితులకు అండగా..

ప్రవాస భారతీయులు ప్రమాదవశాత్తు మృతి చెందిన సందర్భాల్లో వారి మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అలాంటి కష్ట సమయంలో ఈటీసీఏ భారత ఎంబసీతో సంప్రదింపులు జరిపి 28 మంది గల్ఫ్ బాధితుల మృతదేహాలను స్వస్థలాలకు తరలించేందుకు సహకరించింది. దీంతో చివరిసారిగా తమ ఆత్మీయులను చూసుకునే అవకాశం వారి కుటుంబాలకు లభించింది. మృతుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని, వారి పిల్లల విద్య, వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తోంది.

దుబాయ్‌లో పక్షవాతం వచ్చిన బాధితుడికి 50 వేల ఆర్థిక సాయం అందిస్తూ..

అలాగే దుబాయ్‌లో వివిధ కారణాలతో ఇబ్బందుల్లో చిక్కుకుని స్వదేశానికి తిరిగి రావాలను కున్న కార్మికులకు కూడా ఈటీసీఏ అండగా ఉంటోంది. విమాన టికెట్ కొనుగోలు చేసే స్థోమత లేక స్వదేశా నికి రాలేక చిక్కుకుపోయిన 206 మంది కార్మికులకు విమాన టికెట్లు అందించింది. కరోనా మహమ్మారి సమయంలోనూ ఈటీసీఏ సేవా కార్యక్రమాలకు విరామం ఇవ్వలేదు. దుబాయ్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న 1200 మందికి వారానికొకసారి నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. ప్రభుత్వ అనుమతితో ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేసి 450 మంది కార్మికులను వారి స్వస్థలాలకు చేర్చింది. ఈటీసీఏలో మహిళా విభాగం కూడా సేవా కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతి కార్యక్రమంలో మహిళలు చురుగ్గా పాల్గొంటూ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తమ వంతు సహకారం అందిస్తున్నారు.

గల్ఫ్ కార్మిక చట్టాల కోసం..

గల్ఫ్ కార్మికుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చి ఆదుకోవాలని ఈటీసీఏ గళం వినిపించింది. గల్ఫ్ అన్ని దేశాల్లోని సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపినప్పుడు ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచింది.

సేవకు సరిహద్దులు లేవని..

సేవా కార్యక్రమాలతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటంలోనూ ఈటీసీఏ ముందుంటోంది. బతుకమ్మ, దసరా, సంక్రాంతి, ఉగాది, బోనాలు వంటి పండుగలను దుబాయ్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తోంది. కుల, మత, ప్రాంత, వర్గ భేదాలకు అతీతంగా.. యూఏఈ చట్టాలను గౌరవిస్తూ ఈ వేడుకలను నిర్వహిస్తూ ప్రతి ఒక్కరికీ ఆహ్వానం పలుకుతోంది. పండుగలు నిర్వహించడం మాత్రమే కాకుండా.. ఈటీసీఏ 15ఏళ్ల కష్టంలో ఉన్న వారికి అండగా నిలుస్తోంది.

వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు (ఫైల్)

ప్రవాస భారతీయులకు అండగా నిలిచేందుకే...: పిచర కిరణ్ కుమార్ వ్యవస్థాపక అధ్యక్షుడు

ఉపాధి కోసం వచ్చిన ప్రవాస భారతీయులు పడుతున్న బాధను చూసి ఈటీసీఏను ఏర్పాటు చేశాం. విదేశీ గడ్డపై ఉన్న వారి కష్టాలను మా కష్టాలుగా భావిస్తూ వారికి ఎంతో కొంత భరోసా కల్పిస్తున్నాం.

ప్రారంభం నుంచి అదే స్ఫూర్తి.. చీటి జగదీశ్వర్‌రావు, అధ్యక్షుడు

ఈటీసీఏ 2011లో ఏర్పాటు చేయగా, ప్రారంభంలో ఆపదలో ఉన్నవారికి ఎలా చేయూత నిచ్చేమో ఇప్పుడు కూడా అండగా నిలవడం సంతోషంగా ఉంది. ఇక ముందు కూడా ఇంతకు మించి చేయాలని ఉంది.

సంస్కృతి ఉట్టిపడేలా పండగలు... రాణి కోట్ల, ప్రధాన కార్యదర్శి

ఎడారి దేశంలో సంస్కృతి ఉట్టిపడేలా పండగలు జరుపుకోవడం చాలా సంతోషం కలిగిస్తోంది. ఇక్కడి చాలా మందిని ఆహ్వానించి పండగలను వైభవంగా నిర్వహిస్తున్నాం.

చేపల వేటకు వెళ్లి వలస కూలీ మృతి

మృతదేహాన్ని బయటకు తీస్తున్న సిబ్బంది

మంథనిరూరల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిసోమ న్‌పల్లి గ్రామం పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లిన ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన చోటు భుయ్యాన్(26) అనే వలస కూలీ సోమవారం మృతి చెందాడు. అడవి సోమన్‌పల్లిలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పని చేయడానికి ఝార్ఖండ్ రాష్ట్రంలోని ఫలామౌ జిల్లాలోని చీలిభర్వాపి గ్రామానికి చెందిన చోటు భుయ్యాన్ బంధువులతో వచ్చాడు. ఉదయం పక్కనే అడవిలో ఉన్న పెద్ద చెరువులో చేపల వేట కోసం మరో ఐదుగురితో కలిసివెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో చోటు భుయ్యాన్ చెరువులో మునిగిపోయాడు. ఆచూకీ తెలియకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఏఎస్ఐ మల్లయ్య, ఫైర్ ఆఫీసర్ శివశంకర్, సిబ్బంది చందర్, శ్రవణ్‌కుమార్, నరేందర్, నాగరాజు సంఘటన స్థలానికి చేరుకొని చెరువులో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి అన్న నిరూపత్ భుయ్యాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు, ఆటో ఢీ.. ఒకరికి స్వల్ప గాయాలు

తంగళ్లపల్లి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారులో కారు, ఆటో ఢీకొనడంతో ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. సిద్దిపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై మూలమలుపుల వద్ద చెట్లకొమ్మలు రోడ్డుపైకి రావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద చెట్ల కొమ్మలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కాగా ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బస్సు టైర్ కింద పడి వృద్ధుడికి తీవ్రగాయాలు

కథలాపూర్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం బస్సు టైర్ కిందపడి గంగారాం అనే వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కోరుట్ల నుంచి వేములవాడకు ఆర్టీసీ అద్దె బస్సు వెళ్తుండగా కథలాపూర్ బస్టాండ్‌లో డ్రైవర్ నిలిపాడు. ప్రయాణికులు కిందకు దిగిన క్రమంలో ముందుకు కదులుతుండగా ఓ వృద్ధుడు అడ్డుగా రావడంతో టైరు కాళ్లపై ఎక్కింది. దీంతో కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గంగారాం రెండు సంవత్సరాలుగా నడవ లేని స్థితిలో ఉండి చేతులతోనే కదులుతూ ఉంటాడు. బస్సు కదులుతున్న సమయంలోనే అటువైపుగా రావడంతో టైర్ ఎక్కి రెండు కాళ్లకు గాయాలయ్యాయి. వృద్ధుడిని డ్రైవర్ చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. క్షతగాత్రుడికి తనకంటూ ఎవరూ లేకపోవడంతో ప్రతీదినం రోడ్డు వెంట తిరుగుతుంటాడని గ్రామస్తులు తెలిపారు.

భార్యపై హత్యాయత్నం.. భర్తకు రెండేళ్ల జైలు శిక్ష

కోల్‌సిటీ, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మద్యం కోసం డబ్బులు ఇవ్వలేదనే కోపంతో కత్తెరతో దాడిచేసి భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన భర్తకు గోదావరిఖని అసిస్టెంట్ సెషన్ జడ్జి జీవన్ సూరజ్ సింఘ్ రెండేళ్ల కఠిన కారాగా శిక్ష, రూ.10వేల జరిమానా విధించారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన పర్లపల్లి సంపత్ మద్యానికి బానిసై భార్య స్వప్నను వేధించేవాడు. ఒకసారి గొడ్డలితో దాడి చేయగా పెద్దల సమక్షంలో పంచాయితీ చేసి కాపురానికి పంపారు. స్వప్నకు పుట్టింటివారు ఖర్చులకు డబ్బులు ఇవ్వగా అందులో నుంచి వెయ్యి రూపాయలు తనకు ఇవ్వలేదనే కోపంతో కత్తెరతో సెప్టెంబరు 24, 2022న పర్లపల్లి సంపత్ తన భార్య స్వప్నపై దాడిచేశాడు. స్వప్న మెడ, పక్కటెముకల్లో విచక్షణరహితంగా పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఎస్ఐ కే రమేష్ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశాడు. పీపీ చెలుకల పద్మజ, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సతీష్‌కుమార్, సీఎంఎస్ శంకర్ సాక్షులను ప్రవేశపెట్టారు. ఇరువైపులా వాదనలు విన్న జడ్జి సూరజ్‌సింగ్ నేరం రుజువు కావడంతో ఎర్లపల్లి సంపత్‌కు జైలు శిక్ష విధించారు.

క్షుద్రపూజల పేరుతో అమాయకులకు టోకరా

- ఇద్దరి అరెస్ట్.. రూ 30.50లక్షల నగదు స్వాధీనం

సిరిసిల్లలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేష్‌బీగీతే

సిరిసిల్ల అర్బన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): క్షుద్రపూజలు, మంత్రాల పేరిట అమాయకులకు టోకరా వేస్తున్న వారిని ప్రజలు నమ్మి మోసపోవద్దని ఎస్పీ మహేష్‌బీగీతే కోరారు. సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. క్షుద్రపూజల పేరిట మోసగించిన తురుపాటి శ్యాంకుమార్, పత్తెం లక్ష్మీరాజంలను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.30.50లక్షల నగదుతోపాటు సెల్‌ఫోన్లు క్షుద్రపూజల సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులైన కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన బేడ బుడిగజంగం కులానికి చెందిన తురుపాటి శ్యాంకుమార్, వేములవాడ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పత్తెం లక్ష్మీరాజం ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన బండారి లత అనే మహిళను అనారోగ్యం నయం చేస్తామని చెప్పి రూ.10 లక్షలు వసూలు చేశారు. ఆ తర్వాత మరో రూ. 21 లక్షలు, అనంతరం రూ. 13 లక్షలు వసూలు చేశారు. ఆ తర్వాత విడతల వారీగా వారిద్దరూ రూ62 లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులను తిరిగి ఇవ్వమని అడగడంతో చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారని వివరించారు. ఈ మేరకు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసును నమోదు చేసిన పోలీసులు అగ్రహారంలో లక్ష్మీరాజంను అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ 30.50లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్‌లను, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారని, ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ శ్రీనివాస్, ఎస్.ఐ గణేష్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వేములవాడకు చేరుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

- స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ, ఆలయాధికారులు

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో మాట్లాడుతున్న రాజన్న సిరిసిల్ల కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే

వేములవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వర స్వామి వారి ఆలయానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం రాత్రి చేరుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే, రాజన్న ఆలయ డీఈవో ప్రతాప నవీన్ కుమార్‌లు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. మంగళవారం ఉదయం భీమేశ్వర స్వామిని దర్శించుకోనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. వారివెంట ఆలయ సూపరింటెండెంట్ అరుణ్, రాజేందర్, శివసాయి ఉన్నారు.

కళాకారులకు నిలయం గర్రెపల్లి

- రాష్ట్రపతి అవార్డు గ్రహీత రామయ్యకు ఘన సన్మానం

దురిశెటి రామయ్యను సన్మానిస్తున్న గ్రామస్తులు

సుల్తానాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులకు నిలయమైన గర్రెపల్లికి చెందిన జానపద కళాకారుడికి రాష్ట్రపతి అవార్డు రావడం తమ ప్రాంతానికి గర్వకారణమని గర్రెపల్లి గ్రామస్తులు అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామానికి చెందిన కడితంత్రి వాయిద్య కళాకారుడు దురిశెటి రామయ్య ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం గర్రెపల్లిలో రామయ్యకు సన్మానసభ ఏర్పాటు చేశారు. వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు కన్న రమేష్, కస్తూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గర్రెపల్లి చెరువు వద్ద శివుడి విగ్రహం ఎదుట రామయ్యను ఘనంగా సన్మానించారు. ఆనంపల్లి శ్రీనివాస్, అల్లం తిరుపతి, పసెడ్ల తిరుపతి, ఆసరి రాజయ్య, పెగడపల్లి బాబా, సినీ డైరెక్టర్ వెంకటరెడ్డి, వెంకటేష్, మహేష్, గోవర్ధన్, లక్ష్మణ్ ఆది కోటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

భీమన్న లడ్డూలో పురుగు కలకలం..

లడ్డూలో కనిపిస్తున్న పురుగు

వేములవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలోని లడ్డూలో పురుగు ప్రత్యక్షం కావడం కలకలం సృష్టించింది. సిరిసిల్ల పట్టణం గణేష్‌నగర్‌కు చెందిన సంతోష్ అనే భక్తుడు సోమవారం వేములవాడ భీమన్న దర్శనానికి వచ్చాడు. దర్శనం అనంతం ప్రసాదాల కౌంటర్‌లో లడ్డూలు తీసుకున్నాడు. అనంతరం లడ్డూ తినేందుకు యత్నిం చగా పురుగు కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రసాదాల కవర్‌పై ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసినా స్పందించడం లేదని ఆలయ అధికారుల తీరుపై అతడు అసహనం వ్యక్తం చేశాడు.

రేకుర్తిలో ఎలుగుబంటి సంచారం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం రేకుర్తి గ్రామ శివారులో ఎలుగుబంటి తచ్చాడుతూ స్థానికులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఆదివారం రాత్రి 10:15 గంటల సమయంలో ఒక షెడ్ వద్ద ఎలుగుబంటి గోడదూకేందుకు వచ్చినట్లుగా సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ సీసీ కెమెరా దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

కాగా రేకుర్తి, లక్ష్మీపూర్, విద్యానగర్, శాతవాహన విశ్వవిద్యాలయం, యాస్వాడ, శ్రీరాంనగర్ కాలనీ ప్రాంతాల్లో ఎలుగుబంటి కదలికలను స్థానికులు గమనించటం సాధారణమే. గతంలో కూడా పలుమార్లు శాతవాహన విశ్వవిద్యాలయం ఆవరణలోని గుట్టపై ఎలుగుబంటి నివాసం ఏర్పాటు చేసుకుని, రాత్రి వేళ ఆహారం, తాగునీటి కోసం బయటకు వస్తూ రేకుర్తి, విద్యానగర్, శ్రీరాంనగర్ కాలనీ వాసులకు దర్శనమిచ్చేది. ఎలుగుబంటిని బంధించేందుకు అటవీశాఖ అధికారులు కూడా పలుమార్లు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు.

భక్త జనసంద్రంగా వేములవాడ

80 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తులు

ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు, శివకల్యాణంలో పాల్గొన్న దంపతులు

వేములవాడ, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో సోమవారం సందర్భంగా వేములవాడ భీమేశ్వర ఆలయం భక్త జన సంద్రంగా మారింది. దేశ నలుమూలల నుంచి 80 వేల మందికి పైగా భక్తులు స్వామివారి దర్శనానికి తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుని పవిత్రస్నానాలు ఆచరించారు. స్వామివారి దర్శనం కోసం జనరేటర్ రూమ్ వరకు ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు పూర్తిగా నిండిపోవడంతో భక్తులు రాజన్న ఆలయ గుడిచెరువు పార్కింగ్ స్థలం గేటు నుంచి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన క్యూలైన్‌లలో వేచివున్నారు. స్వామివారికి కోడెమొక్కు చెల్లించుకునేందుకు వచ్చిన భక్తులకు కోడెమొక్కు క్యూలైన్‌లో ఐదు గంటలపాటు నిరీక్షించినట్లు తెలిపారు. ఆయా క్యూలైన్‌లలో బారులు తీరిన భక్తులు చేసిన శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం భక్తిపారవశ్యంతో సందడిగా మారింది. ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ ఆలయం, నగరేశ్వర స్వామి ఆలయాలు రద్దీగా మారాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఆదేశాలతో డీఈవో ప్రతాప నవీన్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. భీమేశ్వర స్వామి వారి సోమవారం 80 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు.

ఘనంగా మహాలింగార్చన...: వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించగా, సాయంత్రం 6.05 గంటలకు భీమేశ్వరస్వామి ఆలయంలోని గాయత్రిమాత ఆలయ మండపంలో మహాలింగార్చనను వైభవంగా చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో లింగార్చనలో పాల్గొన్నారు.

భీమన్న సేవలో రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శి..

వేములవాడ భీమేశ్వర స్వామిని రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శి భారతి లక్పతి నాయక్(ఐఏఎస్) సోమవారం దర్శించుకున్నారు. భీమన్న ఆలయానికి చేరుకున్న ఆమెకు అర్చకులు, డీఈవో ప్రతాప నవీన్ కుమార్ స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఏఈవో జయ కుమారి అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో సోమవారం భక్త జన సందడి నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం క్షేత్ర సమీపంలో గల అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు శివుడికి జలాభిషేకం, బిల్వార్చన చేశారు. వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, బూస ప్రవీణ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంకష్టహర చతుర్థి పూజలు: సంకష్టహర చతుర్థి సందర్భంగా లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో అభిషేకం నిర్వహించారు. వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు, హారతి, మంత్రపుష్ప కార్యక్ర మాలు నిర్వహించారు.

ధర్మపురిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

అల్లెపు రమేష్ (ఫైల్), పంబాల మహేష్ (ఫైల్)

కరీంనగర్, జగిత్యాల జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. కరీంనగర్‌లో అప్పుల బాధతో వేములవాడకు చెందిన వ్యాపారి, జగిత్యాల జిల్లా మాదాపూర్‌లో కుటుంబ కలహాలతో యువకుడు, ధర్మపురిలో ఫైనాన్స్ వారి వేధింపులు తట్టుకోలేక యువకుడు బలవన్మారణాలకు పాల్పడ్డారు.

● అప్పుల బాధతో వ్యాపారి...

కరీంనగర్ క్రైం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని అల్కాపురి కాలనీ ప్రాంతంలో ఒక లాడ్జిలో వేములవాడ పట్టణానికి చెందిన నరాల కార్తీక్(33)అనే వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడకు చెందిన నరాల కార్తీక్ తన కారులో కరీంనగర్‌కు పని నిమిత్తం వెళుతున్నానని భార్యకు చెప్పి ఆదివారం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న పుల్లల లాడ్జికి వచ్చి, ఒక గది తీసుకుని అందులో ఉన్నాడు. రాత్రి సమయంలో భార్య ఫోన్‌చేయగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం కరీంనగర్‌లో వెతికారు. సోమవారం ఉదయం అల్కాపూరి కాలనీలోని ఎన్‌టీఆర్ విగ్రహం సమీపంలో ఉన్న పుల్లల లాడ్జి వద్ద అతని కారు కనిపించడంతో లాడ్జి సిబ్బందిని సంప్రదించారు. అనంతరం గదిని బలవంతంగా తెరవగా కార్తీక్ సీలింగ్ ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని మృతిచెందినట్లు గుర్తించారు. కార్తీక్ గతంలో వేములవాడలో చిట్టీల వ్యాపారం నిర్వహించగా నష్టాలు రావడంతో మూడు సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఆ వ్యాపారంలో కూడా నష్టాలు వచ్చి అప్పులు కావడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

● కుటుంబ కలహాలతో యువకుడు..

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన అల్లెపు రమేష్ (32) అనే యువకుడు కుటుంబకలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ శ్యాంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ కొన్నిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లి నెల రోజుల క్రితం తిరిగి వచ్చాడు. కొన్నిరోజులుగా రమేష్‌కు తన భార్యకు కుటుంబవిషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా రమేష్ తన భార్యతో గొడవపడ్డాడు. రాత్రి రమేష్ ఇంటికి మద్యం సేవించి వచ్చి ఫ్యానుకు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. రమేష్ తండ్రి గంగారాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

● ఫైనాన్స్ వేధింపులు తాళలేక..

ధర్మపురి: పట్టణంలోని ముదిరాజ్‌వాడకు చెందిన పంబాల మహేష్ (29) అనే యువకుడు ఉరివేసుకొని సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి ఎస్ఐ నాగపురి సదాకర్ కథనం ప్రకారం.. ఇటీవల కాలంలో మహేష్ ఒక ప్రైవేట్ ఫైనాన్స్‌లో లోన్ తీసుకొని ఇళ్లు నిర్మించుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్ల లోన్ తీర్చలేని స్థితిలో ఈఎంఐలు పెండింగ్‌లో పడిపోయాయి. ఫైనాన్స్ వాళ్లు ఈ రోజు వచ్చి లోన్ డబ్బులు తీర్చాలని ఒత్తిడి చేశారు. గతంలో కూడా 'ఈ ప్రాపర్టి ఆప్టస్ ఫైనాన్స్‌లో తనాఖాలో ఉంది' అంటూ మహేష్ ఇంటి గోడ పైన రాసి వెళ్లారు. దీంతో అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురైన మహేష్ ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కొడుకులు ఉన్నారు. మహేష్ భార్య మంజుల ఫిర్యాదు మేరకు శవ పంచనామ జరిపి, పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మపురి ఎస్ఐ సదాకర్ తెలిపారు.

అందరివాడు ఆట ఆపేశాడు

ఫుట్‌బాల్‌తో పెద్దగా పరిచయం లేని వాళ్లు కూడా కాసేపు తన ఆట చూస్తే ఆ ఆటలో మజా ఏంటో అర్థమై ఆస్వాదించేలా చేయగల ఆకర్షణ కలిగినవాడు.. మైదానంలో పాదరసంలా కదలాడుతూ, అద్భుతమైన డ్రిబ్లింగ్ నైపుణ్యంతో ప్రత్యర్థుల గుండెల్లో దడ పుట్టించినవాడు.. కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్స్‌తో ప్రపంచ రికార్డులు కొల్లగొట్టిన ఘనుడు.. తన మంత్రముగ్ధమైన ఆటతో యావత్ క్రీడాలోకాన్ని ఉర్రూతలూగించినవాడు.. మాటల్లో సౌమ్యుడు, చేతల్లో ఘనాపాఠిగా ఉంటూ అభిమానులకు అపరిమితమైన ఆనందాన్ని పంచిన అందరివాడు.. ఆటనే ప్రేమించి.. ఆటనే శ్వాసించి.. ఆటనే శాసించిన లియోనెల్ మెస్సీ.. ఇక చాలని సెలవు తీసుకొన్నాడు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు మెస్సీ గుడ్‌బై

బ్యూనస్ ఎయిర్స్: అర్జెంటీనా ఫుట్‌బాల్ గ్రేట్ లియోనెల్ మెస్సీ (39) అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. రెండు దశాబ్దాలపాటు అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించిన మెస్సీ. జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్టు సోమవారం స్పానిష్ భాషలో తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. రికార్డు స్థాయిలో దేశం తరపున ఆరు వరల్డ్‌కప్‌లు ఆడాడు. 2016లో కోపా కప్ ఫైనల్లో ఓటమి తర్వాత విమర్శలకు తట్టుకోలేక తొలిసారి రిటైర్మెంట్ ప్రకటించిన మెస్సీ.. అభిమానుల విజ్ఞప్తితో పునరాగమనం తర్వాత అంతా స్వర్ణ యుగమే. మెస్సీ సారథ్యంలో 2022లో కతార్‌లో జరిగిన సాకర్ ప్రపంచకప్‌లో అర్జెంటీనాను విజేతగా నిలవగా.. 2026 మెగా టోర్నీ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓడింది. అయితే, తుది పోరులో ఓడిన రెండు రోజుల తర్వాత తన రిటైర్మెంట్ లేఖను రాసినట్టు మెస్సీ తెలిపాడు. కానీ, తన తండ్రి జార్జ్ మెస్సీ అనారోగ్యం, ఆయన మృతి కారణంగా బహిర్గతపర్చడానికి సమయం తీసుకొన్నట్టు తెలిపాడు. కాగా, క్లబ్ సాకర్‌లో లియోనెల్ మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం అతడు ఇంటర్ మయామి కెప్టెన్‌గా ఉన్నాడు. మరో రెండేళ్లపాటు ఆ క్లబ్‌తో అతడికి అగ్రిమెంట్ ఉంది.

'ఫైనల్ ముగిసిన ఇన్ని రోజుల తర్వాత, ఎంతో ఆలోచించిన తర్వాత, జాతీయ జట్టుకు రిటైర్మెంట్ ప్రకటించాలనే నా నిర్ణయాన్ని మీకందరికి తెలియజేస్తున్నా. ఇది ఎంతో బాధ కలిగించే నిర్ణయమే అయినా.. అందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా. అర్జెంటీనా జెర్సీ కోసం సర్వస్వం ధారపోశా. జట్టుతో కలసి దేశానికి ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించా. అర్జెంటీనా ప్రజలను గర్వపడేలా చేయడం ఎప్పుడూ ఆనందమే. ఇక, సమయం తరిగిపోతుంది. కొన్ని అధ్యాయాలు ముగిసిపోనున్నాయి.

సర్వం ధారపోశా..

లియోనెల్ భావోద్వేగ లేఖ

దేశానికి ప్రాతినిథ్యం వహించడం నాకు ఎంతో ఇష్టం. నా దగ్గర ఉన్నదంతా ఇచ్చేశా. ఇక నా వద్ద ఏమీ మిగల్లేదు. ఎంతో మంది ప్రతిభగల యువ ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. వారికి ఇదే తగిన సమయం. 20 ఏళ్లుగా అందించిన ప్రేమ, అభిమానానికి కృతజ్ఞతలు. ఇకపై జాతీయ జట్టుకు బయట నుంచి అభిమానించే వ్యక్తిగా ఉంటా. కుటుంబం, కోచ్, సహచరులు, జట్టు అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. చిరస్మరణీయ జ్ఞాపకాలను నాతో తీసుకెళ్తున్నా. నా సహచరులతో కలసి ఒకప్పుడు కలలు కన్న క్షణాలను.. మీకు అందించామనే సంతృప్తితో సగర్వంగా నిష్క్రమిస్తున్నా. అర్జెంటీనావాడిగా నన్ను పుట్టించినందుకు దేవుడికి కృతజ్ఞతలు. లెట్స్ గో అర్జెంటీనా..'

— లియోనెల్ మెస్సీ



యుగానికొక్కడు

ఎదుగుదల లోపంతో ఏమైపోతాడో? అనుకొన్నవాడు.. తన ఆటతో రెండు దశాబ్దాలపాటు కోట్లాది మంది అభిమానుల హృదయాలను కొల్లగొట్టాడు. కష్టాలకు ఎదురీదాడు.. పట్టుదలతో పోరాడాడు.. ఓర్పుతో నేర్చాడు.. సాకర్ చరిత్రలో మహోన్నత శిఖరంగా నిలిచాడు.

ఓ శకం ముగిసింది!

మెస్సీ మేనియా దాదాపు రెండు దశాబ్దాలపాటు ప్రపంచాన్ని ఊపేసింది. బార్సిలోనా తరపున మెరుపులు మెరిపించిన మెస్సీ.. 2004లో అర్జెంటీనా అండర్-20 జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. అప్పుడు అతడి ఆట విశ్లేషకులను ఎంతగానో ఆకట్టుకొంది. 2005లో 18 ఏళ్ల వయసులో జాతీయ జట్టులోకి వచ్చిన లియోనెల్.. క్రమంగా జట్టు మూలస్తంభంగా మారాడు. 2006 ప్రపంచ కప్‌లో తొలిసారి అర్జెంటీనాకు ప్రాతినిథ్యం వహించాడు. 2009లో జువాన్ రోమన్ రిక్వెల్మీ రిటైర్మెంట్‌తో నెం:10 జెర్సీ మెస్సీకి వచ్చింది. ఇక, 2010 ఫిఫా వరల్డ్‌కప్ అర్జెంటీనా జట్టును మెస్సీ కేంద్రంగా కోచ్ మారడోనా తయారు చేశాడు.

చేదు అనుభవాలు..

జాతీయ జట్టు అర్జెంటీనా తరపున మాత్రం ఎన్నో చేదు అనుభవాలు. 2007 కోపా కప్‌లో ఓటమి.. 2014 వరల్డ్‌కప్ ఫైనల్లో ఓటమి మెస్సీని తీవ్ర నిరుత్సాహానికి గురి చేసింది. 2015, 2016 కోపా కప్‌లో కూడా పరాజయాలతో.. తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అతడిని జట్టు నుంచి తప్పించాలనే డిమాండ్ బలంగా వినిపించింది. తల్లడిల్లిపోయిన లియోనెల్ ఫుట్‌బాల్‌కు వీడ్కోలు పలికాడు.

శూన్యం నుంచి..

మెస్సీ దూరం కావడంతో ఒక్కసారిగా అర్జెంటీనా జట్టులో శూన్యం ఆవరించింది. తట్టుకోలేక పోయిన ఫ్యాన్స్.. మళ్లీ తిరిగి రావాలని కోరారు. అభిమానుల కోరికను మెస్సీ మన్నించడం అతడి జీవితంలో.. కెరీర్‌లో ఓ మేలి మలుపు. ఎక్కడైతే పోగొట్టుకొన్నారో.. అక్కడే వెతుక్కోమన్నట్టుగా రీఎంట్రీలో మెస్సీ తననుతాను సరికొత్తగా ఆవిష్కరించుకొన్నాడు. 2021లో మరకాన స్టేడియంలో కోపాకప్‌ను అతడు ముద్దాడడం ఫుట్‌బాల్ చరిత్రలోనే భావోద్వేగ సందర్భం. అర్జెంటీనాకు ట్రోఫీ అందించడంతో అతడికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

'ఎడారి'లో దాహం తీరింది..

2022 కతార్‌లో జరిగిన ఫిఫా వరల్డ్‌కప్.. ఒక రకంగా మెస్సీకి చివరి అవకాశం అని భావించారు. మెగా టోర్నీ తొలి మ్యాచ్‌లోనే సౌదీ అరేబియా చేతిలో ఓటమి. ఇంత గొప్ప ఆటగాడి కెరీర్ వరల్డ్‌కప్‌ను అందుకోకుండానే ముగుస్తుందా? అనే నిర్వేదం. కానీ, డీలా పడిన జట్టులో స్ఫూర్తిని రగిల్చిన మెస్సీ.. వరుస విజయాలతో జట్టును ఫైనల్‌కు చేర్చాడు. ఫ్రాన్స్‌తో టైటిల్ ఫైట్‌లో డ్రామా నడిచినా.. షూటౌట్‌లో అర్జెంటీనాను గెలిపించిన మెస్సీ.. 'గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్'గా తనపేరును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించుకొన్నాడు. 2024లో మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా మరోసారి కోపా అమెరికా కప్ విజేతగా నిలవగా.. 2026 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంప్‌గా బరిలోకి దిగిన అర్జెంటీనాను లియోనెల్ మరోసారి ఫైనల్‌కు చేర్చాడు.

హైదరాబాద్‌తో అనుబంధం

